Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు :3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం జూన్22, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# ఢిల్లీకి సీఎం చంద్రబాబు



**టి మీడియా, జులై 21,అమరావతి:**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ప్రధానితో చర్చించే అవకాశం ఉంది.ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను సైతం సీఎం చంద్రబాబు కలవనున్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర సహకారం వంటి అంశాలపై వారితో చర్చించనున్నట్లు తెలుస్తోంది. రేపు ఢిల్లీలోనే సీఎం చంద్రబాబు బస చేయనున్నారు. పర్యటన అనంతరం రాష్ట్రానికి తిరిగి రానున్నారు.

# ప్రతి నెలా తనిఖీ చేస్తా

- **నెలలో ఒకరోజు సైట్‌లోనే బస చేస్తా**
- **కొడంగల్ లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**



**టి మీడియా, జులై 21, కొడంగల్:**
జిల్లా హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతిని తనిఖీ చేస్తానని చెప్పారు.ముఖ్యమంత్రి ఎడ్యుకేషన్ హబ్‌కు సంబంధించి ఆయా విద్యా సంస్థల భవన నిర్మాణాలను, ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగంగా నిర్మిస్తున్న ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ కాలేజీలు, ఫిజియో థెరఫీ పారా మెడికల్ కాలేజీలు, సంబంధిత హాస్టళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతీ నెలా పనుల పురోగతిపై తనిఖీ చేయడమే కాకుండా ఒక రోజు సైట్‌లోనే బస చేస్తానని చెప్పారు.



పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి వారిని సస్పెండ్ చేయడానికి వెనుకాడొద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

# మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి



**● ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ ధర్నా**

**టి మీడియా , జూలై 21, ఢిల్లీ బ్యూరో :**
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై దిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ నివాసం వద్ద ధర్నాకు దిగారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్యనేతలు ప్రధాని నివాసం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. అంతకుముందు దేశంలోని యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. దిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నేతలతో జితేంద్ర సింగ్ చర్చ**

మోదీ ఇంటి ముందు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నేతలు చేతులకు తాళ్లు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి తరలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తమ వాదనను పార్లమెంటులో ఆలకించడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రహదారులపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలతో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చర్చలు జరుపుతున్నారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.

**విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు!**

అంతకుముందు దేశంలో యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. దిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.





# అమెరికా, ఇరాన్‌ల యుద్ధం



**● సౌదీ షిప్పింగ్‌కు పెను ముప్పు**

**టి మీడియా, జులై 21, ఢిల్లీ బ్యూరో :**
పశ్చిమ ఆసియాలో రోజురోజుకూ తీవ్రమవుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు కలవరపాటుకు గురి అవుతున్నాయి. మధ్యప్రాచ్యం రగిలిన అగ్నిజ్వాలలు రోజురోజుకూ భీకర రూపం దాల్చుతున్నాయి. అమెరికా -- ఇరాన్ ల మధ్య ప్రారంభమైన ఈ ప్రత్యక్ష పోరాటం, ఇప్పుడు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా మొత్తం పశ్చిమ ఆసియా ప్రాంతాన్ని ఒక వినాశకరమైన యుద్ధంలోకి నెట్టివేసే స్థాయికి చేరుకుంది. వరుసగా పదో రాత్రి కూడా యూఎస్ సెంట్రల్ కమాండ్ నేతృత్వంలో అమెరికా వైమానిక దళాలు ఇరాన్ భూభాగంపై విరుచుకుపడ్డాయి. ఇరాన్ మిలిటరీ కమాండ్ కేంద్రాలు, క్షిపణి, డ్రోన్ ప్రయోగ స్థావరాలు, వ్యూహాత్మక వాయు రక్షణ వ్యవస్థలతో పాటు ప్రాముఖ్యత కలిగిన నావికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి.

**రంగంలోకి హౌతీ తిరుగుబాటుదారులు**

అంతర్జాతీయ జలసంధి అయిన హార్ముజ్ గుండా ప్రయాణించే వాణిజ్య, చమురు నౌకల భద్రతను కాపాడటానికే ఈ చర్యలని అమెరికా సమర్థించుకుంటున్నప్పటికీ.. ఈ దాడుల పరిధి క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా దక్షిణ ఇరాన్ పరిధిలోని కీలకమైన బందర్ అబ్బాస్ ఓడరేవు, ఖేష్మ్ ద్వీపం, చబహార్ పరిసర ప్రాంతాలలో భారీ శబ్దాలతో పేలుళ్లు సంభవించినట్లు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. బుషెహర్ ప్రాంతంలో ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు నిరంతరం క్రియాశీలంగా మారి శత్రు క్షిపణులను ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిస్థితుల మధ్య, ఇరాన్ ప్రాపకం ఉన్న యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు రంగంలోకి దిగడంతో పరిణామాలు మరింత దారుణంగా మారాయి.

# కన్నేస్తారు - కాజేస్తారు



- **విశాఖలో రెచ్చిపోతున్న అక్రమార్కులు**

**టి మీడియా , జూలై 21, విశాఖపట్నం :**
విశాఖపట్నం జిల్లాలో విలువైన ఆస్తులు కొట్టేసేందుకు భూ మాఫియా అడ్డగోలు వ్యవహారాలు సాగిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఖాళీ స్థలాలకు దొంగ యజమానులు పుట్టుకొస్తున్నారు. వారికి సంబంధం లేని ఆస్తులకు యజమానులైపోతున్నారు. అందుకు పక్కాగా ఆధారాలు సృష్టిస్తున్నారు. బతికున్న వారు చనిపోయినట్లు, చనిపోయిన వ్యక్తులు బతికి ఉన్నట్లు మాయ చేస్తున్నారు. ఇంకొందరు ఏకంగా కుటుంబ సభ్యులనే మార్చేస్తున్నారు. వీటిపై ఉన్నతాధికారులకు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా కఠిన చర్యలు లేకపోవడంతో కొందరు ఆడిందే ఆటవుతోంది. జిల్లా స్థాయి కమిటీ ఈ అంశంపై దృష్టిసారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

**కన్నేశారో అంతే సంగతి**

ఖాళీగా ఉన్న ఖరీదైన స్థలాలను భూమాఫియా తమ మధ్యవర్తుల సాయంతో గుర్తిస్తుంది. ఆ తర్వాత అసలు యజమానులు ఎవరో ఆరా తీస్తుంది. వారు స్థానికంగా ఉంటే ఒకలా లేకపోతే మరో వ్యూహం అమలు చేస్తారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఉంటే తండ్రి చనిపోయారని ఒక దరఖాస్తు తెరమీదికి తెస్తారు. అతనికి కూతుళ్లు, కుమారులు వీరేనంటూ ఆధారాలు పుట్టిస్తారు. ఆ తర్వాత సదరు ఆస్తి వారి పేరున రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఇలా నగరంలో ఎన్నో జరిగాయి.

**నకిలీ పత్రాలతో మస్కా**

బతికున్న వ్యక్తులు చనిపోయినట్లు పత్రాలు సృష్టించి నరవలో ఆస్తి కొట్టేశారు. దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు అందింది. భీమిలి మండలంలో ఒక ఆస్తి విషయంలో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం నకిలీది పుట్టించి అధికారులను బోల్తా కొట్టించాలని చూశారు. నగరంలోని ఒక ఆస్తికి చెందిన యజమాని దిల్లీలో ఉన్నట్లు తెలుసుకొని అతని కుటుంబ సభ్యులమని కొందరు రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించారు. ఇద్దరు మహిళల్ని యజమాని కుమార్తెలుగా చూపించి నకిలీ విభజన పత్రాలతో మస్కా కొట్టించారు. మరో ఆస్తి విషయంలో సదరు యజమాని మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల పేరుతో ఒకరు రిజిస్ట్రేషన్ చేసేశారు. కొద్ది రోజులకు సదరు యజమాని తాను చనిపోలేదని గగ్గోలు పెట్టాల్సి వచ్చింది.గోపాలపట్నం పరిధిలోని ఓ ప్రభుత్వ స్థలానికి తప్పుడు వివరాలతో ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేశారు. రూ.5 కోట్ల విలువ చేసే ఆ స్థలానికి కొన్ని ఆధారాలు తమకు అనుకూలంగా సృష్టించారు.

# ఉప్పొంగుతున్న బొగత జలపాతం



**● అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం**

**టి మీడియా , జూలై 21, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని గుట్టల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ జలపాతానికి వరద నీరు భారీగా చేరుతుంది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది.బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పర్యాటకులను నీటి కొలనులోకి ఫారెస్ట్ అధికారులు అనుమతించడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి జలపాతం అందాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు వచ్చారు. జలపాతం వీక్షణకే పరిమితం అవడంతో నిరాశకు గురయ్యారు. జలపాతం అందాలను చూస్తూ తమ కెమెరాలో బంధిస్తూ సెల్ఫీలకు ఫోజులిస్తున్నారు. మరోవైపు వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో వాజేడు మండలంలో అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.హైదరాబాద్ - భూపాలపట్నం వరకు 163వ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామం వద్ద పాత వంతెనను తొలగించి నూతన వంతెన ఏర్పాటు కోసం తాత్కాలిక డైవర్షన్ అప్రోచ్ రోడ్డు వేశారు. వరద ప్రవాహానికి తాత్కాలిక డైవర్షన్ అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



# అమెరికాతో వ్యవసాయ ఒప్పందాన్ని రద్దు చేయాలి



● కిసాన్ సంయుక్త మోర్చా

**టి మీడియా , జూలై 21, తొర్రూరు :**
అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వ్యవసాయ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో మంగళవారం తొర్రూరులో ధర్నా నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో అమెరికాతో కుదుర్చుకున్న వ్యవసాయ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ప్రతీకాత్మక పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్కేఎం నాయకులు బొల్లం అశోక్, ముంజపెల్లి వీరన్న, ఆలకుంట్ల సాయిలు, గణపురం లక్ష్మణ్, కొత్త వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, అమెరికాతో పాటు యూరోపియన్ యూనియన్‌తో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వ్యవసాయ వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఒప్పందాల వల్ల చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్రంగా నష్టపోతారని, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశమని, రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ యాకూబ్, జమ్ముల శ్రీను, దర్గయ్య, తిమ్మిడి రవి, రామకృష్ణ, ముద్దెరబోయిన వెంకన్న, రాధా, షమీనా, భాగ్య, వరలక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలపై అధికారుల ఉదాసీనత

**టి మీడియా, జూలై 21, ఖమ్మం రూరల్:**
అక్రమ కట్టడాలపై అధికారులు నిబంధనల పేరుతో కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల వల్ల కొందరు అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తుండగా, మున్సిపల్, పంచాయతీ సిబ్బంది అలసత్వం వల్ల ఎలాంటి కఠిన చర్యలు లేకుండానే యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి అని స్థానికులు వ్యక్తపరుస్తున్నారు.

**నోటీసులకే పరిమితం**
అక్రమ నిర్మాణాన్ని గుర్తించినా, కింది స్థాయి అధికారులు నామమాత్రంగా నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారు. సకాలంలో కూల్చివేతలు జరగకపోవడంతో నిర్మాణాలు పూర్తవుతున్నాయి.

**ప్రజాప్రతినిధుల ఒత్తిడి**
అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటం వల్ల అధికారులు చర్యలు తీసుకోవడానికి భయపడుతున్నారు అన్న గుసగుసలు వినిపిస్తూన్నాయి .మున్సిపల్ శాఖల్లో కొందరు అధికారులు అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై భారీగా ముడుపులు దండుకుంటున్నారు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఆందోళనలో సామాన్యులు**
నిబంధనలు పాటించి ఇళ్లు కట్టుకునే వారు నష్టపోతుండగా, అక్రమంగా నిర్మించే బహుళ అంతస్తుల భవనాల వల్ల భవిష్యత్తులో పార్కింగ్, డ్రైనేజీ సమస్యలు




తలెత్తి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారుఇటీవల కాలంలో సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ.. చట్ట పరిధిని ఉల్లంఘించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లను ప్రయోగించేందుకు అడ్డేమీ లేదని, తగిన నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం కూల్చివేయవచ్చని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో (ఉదాహరణకు జీహెచ్ఎంసీ మున్సిపాలిటీ)లో అధికారులు అప్పుడప్పుడు కూల్చివేతలు చేపడుతున్నప్పటికీ, ముందస్తు చర్యలు లోపించడం వల్ల అక్రమార్కుల ఆగడాలు నడుస్తున్నాయి అన్న ఆరోపణలు వెల్లువెడుతున్నాయి.

# గూడ్స్ వెహికల్ లో ఘాట్ రోడ్డు లో ప్రయాణాలు నిషేధం

● ఎస్సై సంతోష్ కుమార్.



**టీ మీడియా.జూలై21,చింతూరు:**
గూడ్స్ వెహికల్ లో ఘాట్ రోడ్లో ను, మామూలు రోడ్లలోనూ ప్రయాణాలు నిషేధమని, అలా ప్రయాణిస్తే కేసులు తప్పవని చింతూరు ఎస్ఐ పేర్కొన్నారు.పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ,చింతూరు ఏ ఎస్ పి హేమంత్ , సి ఐ గోపాలకృష్ణ వారి ఆదేశాల మేరకు కూలీలు గాని, విహారయాత్రలకు వచ్చేవారు గానీ గూడ్స్ వెహికల్ లో ప్రయాణించిన వెహికల్ సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు . చింతూరు నుండి మారేడుమిల్లి వెళ్ళు ఘాటి రోడ్లో ఎట్టి పరిస్థితుల్లో గూడ్స్ వెహికల్ లో మనుషుల్ని ఎక్కి ప్రయాణించవద్దని తెలియజేశారు ., గత రెండు నెలల్లో చింతూరు ఘాట్ రోడ్ లో వివిధ ప్రాంతాలలో గూడ్స్ వెహికల్ ప్రమాదాలు సంభవించినాయని అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు మరణించడం జరిగిందని తెలిపారు .ప్రతి ఒక్కరూ రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించాలని తెలిపారు.

# మేకలతండాలో ఘనంగా సీత్లా (దాటోడీ) వేడుకలు

● పాడిపంటల సమృద్ధి కోసం ప్రత్యేక పూజలు

**టీ మీడియా,జూలై21,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మేకలతండాలో బంజార గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే సీత్లా (దాటోడీ) పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.పాడిపంటల సమృద్ధి,పశుసంపద ఆరోగ్యం కోసం ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.గిరిజనులైన లంబాడీలు పవిత్రంగా జరుపుకునే తొలి పండుగగా భావించే సీత్లా పండుగ రోజున సీత్లా భవానీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కలరా వంటి మహమ్మారులు ప్రబలకుండా భవానీ అమ్మవారు కాపాడుతారనే విశ్వాసంతో ఆషాఢ మాసంలోని మంగళవారాల్లో ఈ పండుగను జరుపుకుంటారు.తండా పొలిమేరలో సీత్లా భవానీని ప్రతిష్ఠించి, పురుషులు డప్పు వాయిద్యాలతో కోళ్లు,మేకలను తీసుకెళ్లగా,మహిళలు బోనాలు ఎత్తుకుని సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా అమ్మవారి వద్దకు చేరుకున్నారు.అనంతరం గుగ్గిళ్లు,లాప్సి పాయసాన్ని



నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆచారంలో భాగంగా కోళ్లు,మేకలను బలి ఇచ్చి వాటి పేగులపై నుంచి పశువులను దాటించడం వల్ల పశువులకు వ్యాధులు రాకుండా,పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని గిరిజనుల విశ్వాసం.ఈ కారణంగానే ఈ వేడుకను "దాటోడీ" అని పిలుస్తారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై సంప్రదాయ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ఢిల్లీ లాఠీఛార్జికి నిరసనగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆందోళన




● విద్యారంగం భ్రష్టుపట్టిందని సీపీఐ(ఎం) విమర్శ

**టీ మీడియా,జూలై21,సింగరేణి(కారేపల్లి):**
ఢిల్లీలో పార్లమెంట్‌కు శాంతియుతంగా లాంగ్ మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు,నిరుద్యోగులపై లాఠీఛార్జి,నీటి ఫిరంగులు,భాష్పవాయు ప్రయోగించడాన్ని నిరసిస్తూ మంగళవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కే.నరేంద్ర పాల్గొని మాట్లాడారు.దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని,జాతీయ స్థాయి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో విద్యార్థులు,నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నెల రోజులుగా విద్యార్థులు,యువత ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సామాజికవేత్త సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పార్లమెంట్ మార్చ్‌కు పిలుపునిచ్చారని తెలిపారు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జి,నీటి ఫిరంగులు,భాష్పవాయు గోళాలు ప్రయోగించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.మోడీ పాలనలో 12 ఏళ్లలో 14 ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగాయని,కోచింగ్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసిన యువత సమయం,వయస్సు,తల్లిదండ్రుల శ్రమ వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.పేపర్ లీకేజీలతో భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయి కొందరు యువకులు ప్రాణాలు తీసుకున్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని,విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతమవుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్,కాకాటి పృథ్వి,వెంకీ,నవీన్,ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి




● మందులు, ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

**టీ మీడియా జులై,21 ,టేక్మాల్:**
స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పి హెచ్ సి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డి ఎమ్ ఎచ్ ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న నిల్వ మందుల వివరాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలైన లిఎన్ సి డి రక్తపోటు, మధుమేహం వంటి అంటువ్యాధులు కాని వ్యాధులు, టీ బి క్షయ వ్యాధి, ఎమ్ సి ఎచ్ తల్లి మరియు శిశు సంక్షేమం మరియు 14 – 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఇచ్చే ఎచ్ పి వి వ్యాక్సిన్ తదితర ప్రోగ్రామ్‌ల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు**
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున వాతావరణ మార్పులు, నీటి కాలుష్యం వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సేవలు అందించడంలో మరియు విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.ఈ ఆకస్మిక తనిఖీ మరియు సమీక్షా సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ అనిత ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిప్రసాద్ సీహెచ్ఓ పి. నెరమ్మలి, పీహెచ్ఎన్ కె. కృష్ణవేణి, జిల్లా క్షయ వ్యాధి టీ బి సూపర్‌వైజర్లు సాయిబాబా, రాజు, అలాగే న్యూట్రిషన్ ఆఫీసర్ ఎ. దుర్గ ,పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

**టీ మీడియా, జులై 21 ,కూసుమంచి:**
మండల కేంద్రం కూసుమంచికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారుపల్లి కాంతయ్య ( 80 ) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంకి గురై చికిత్స పొందుతూ ఇంటి వద్దే మంచానికి పరిమితమయ్యారు. కాగా వయోభారం, అనారోగ్యం విషమించడంతో కాంతయ్య మృతి చెందారు. మృతుడు కాంతయ్య కి భార్య ఇద్దరు కుమారులు, కోడళ్ళు, ఒక కుమార్తె, మనువళ్ళు, మనువరాళ్లు ఉన్నారు.




కాంతయ్య సుమారు 50 సంవత్సరాల పాటు కూసుమంచి మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.

**రాయల నివాళులు**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారుపల్లి కాంతయ్య పార్థీవ దేహాన్ని మంగళవారం రాష్ట్ర గెడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించి, నివాళు అర్పించారు. కాంతయ్య పార్థివ దేహం వద్ద పుష్పగుచ్చం ఉంచి రాయల శ్రద్ధాంజలి ఘటించారు. కాంతయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని రాయల పేర్కొన్నారు. కాంతయ్య మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల ప్రమాదం కి గురైన కాంతయ్య పెద్ద కుమారుడు బండారుపల్లి శ్రీను ఆరోగ్య పరిస్థితి గురించి రాయల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కాంతయ్య మృత దేహాన్ని సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం డి హఫీజుద్దీన్ సందర్శించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి రమేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్ర అంజయ్య బెల్లంకొండ కిరణ్ గుండా భూపాల్ రెడ్డి పాల్గొని కాంతయ్య మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పాఠశాలల పరిసరాల్లో పోలీసుల తనిఖీలు

● గుట్కా, సిగరెట్లు అమ్మితే కఠిన చర్యలు

**టీ మీడియా జులై 21, ముదిగొండ:**
ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మురళి ఆదేశాల మేరకు మంగళవారం ముదిగొండ, న్యూ లక్ష్మీపురం ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా పాఠశాలల సమీపంలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, వాటి పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మురళి మాట్లాడుతూ.. యువతను, విద్యార్థులను పీడిస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగాన్ని, వాటి అక్రమ రవాణాను, క్రయవిక్రయాలను మండలంలో పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.
పాఠశాలలకు సమీపంలో ఉన్న దుకాణాలలో నిబంధనలకు విరుద్ధంగా గుట్కాలు, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే సహించేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక విక్రయాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన



చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ మురళి దుకాణదారులను హెచ్చరించారు.

# బాలికలకు హెచ్ పీ వి వ్యాక్సిన్ అందుబాటులో

**టీ మీడియా, జులై 21 పెబ్బేరు :**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోనీ (పి హెచ్ సి)ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపు బాలికలందరికీ హెచ్ పీ వి వ్యాక్సిన్ వేయడం జరిగింది ప్రతి రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పీ వి వ్యాక్సిన్ వేస్తారు అలాగే పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో హెచ్ పీ వి వ్యాక్సిన్ గురించి బాలికలకు అవగాహన కల్పిస్తున్న అర్ బి ఎస్ కె డాక్టర్ టి సునీల్ కుమార్ మండల ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్ ఇట్టి కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ పార్వతి స్వరూపరాణి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ ఫార్మ్ ఆఫీసర్ కుమారి ఎ ఎన్ ఎం శారద లావణ్య ఆశా కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు




# రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం అందించాలి

**టీ మీడియా, జులై 21 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించి రోడ్డు విస్తరణ లో 40 ఫీట్లుగా సమం చేసి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు రోడ్డు బాధితులతో కలసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు అయితే రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా కోల్పోతున్న కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం కల్పించడం తన బాధ్యత అని పేర్కొన్నారు ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గణేష్‌కు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్‌కు బీజేపీ నాయకులు మరోసారి వినతిపత్రం అందజేశారు రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు బాధితులకు ఆలస్యం చేయకుండా నష్టపరిహారం అందించాలని కోరారువినతిపత్రంపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కుమ్మర రోడ్డు విస్తరణలో పూర్తిగా నష్టపోయిన వారు కొంత మేర నష్టపోయిన వారి వివరాలను ఇప్పటికే అధికారులు సేకరించి జాబితా సిద్ధం చేశారని తెలిపారు వచ్చే నెలలో అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసి అర్హులైన బాధితులకు ఇంటి స్థలాలు (ప్లాట్లు) కేటాయించే చర్యలు చేపడతామని



హామీ ఇచ్చారు అలాగే రోడ్డు విస్తరణ పనులపై మాట్లాడుతూ మూడు నుంచి నాలుగు ఇళ్ల వరకు పూర్తిస్థాయిలో ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే సూచన మేరకు 38 ఫీట్లు వరకు రోడ్డు విస్తరణకు సడలింపు ఇచ్చినట్లు తెలిపారు ఆ పరిమితిని దాటి రోడ్డు పరిధిలో ఉన్న నిర్మాణాలను మాత్రం నిబంధనల ప్రకారం తొలగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో రోడ్డు విస్తరణ బాధితులు బీజేపీ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు.

# సర్ పై సమీక్ష నిర్వహించిన ఆర్‌జేసీ కృష్ణ



**టి మీడియా , జూలై 21,ఖమ్మం:** 46వ డివిజన్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, 3 టౌన్ ఇన్‌చార్జ్ ఆర్‌జేసీ కృష్ణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని 198 పోలింగ్ బూత్‌ల పరిస్థితిని పరిశీలించి, అక్కడి ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ కృష్ణ గారు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ఓటు ప్రాముఖ్యత, ఓటు విలువను ప్రజలకు వివరించి, ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రక్రియలో ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కనకం భద్రయ్య, డివిజన్ అధ్యక్షులు బొల్లేపల్లి విజయ్, కార్యదర్శి గోదుమల శ్రీనివాస్, బొడ్డుపల్లి వెంకన్న, వేముల సత్యనారాయణ, కంపాటి వెంకన్న, నరసింహారావు, ముసలయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసిన ఆటో డ్రైవర్ అరెస్ట్

**● ఖానాపురం హవెలి ఇన్స్పెక్టర్ భానుప్రకాష్**

**టి మీడియా , జూలై 21, ఖమ్మం:**
ఖానాపురం హవేలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. లంజపల్లి శేఖర్ అలియాస్ టోనీ (31)ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపారు. చర్చి కాంపౌండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ అయిన నిందితుడు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగానే గుర్తించి, వాటి లొకేషన్‌లను తన సెల్‌ఫోన్‌లో భద్రపరుచుకునేవాడని చెప్పారు. అనంతరం రాత్రి వేళల్లో ఆయా ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇటీవల రుద్రంకోటలోని ఓ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను అపహరించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 31.263 గ్రాముల బంగారు స్వాతి హారం, 9.530 గ్రాముల బంగారు జూకాలు,



మాటీలు, మోటరోలా, వివో కంపెనీల సెల్‌ఫోన్లు, అలాగే చోరీలకు ఉపయోగించిన ఏపీ 04 యూఏ 6914 నంబర్ గల బజాజ్ డీజిల్ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. విచారణలో ఖమ్మం అర్బన్, కొనిజర్ల, చింతకాని, రఘునాథపాలెం ప్రాంతాల్లో నమోదైన పలు ఇంటి చోరీలు, గొలుసు లాక్కెళ్లిన కేసుల్లో కూడా తన ప్రమేయం ఉన్నట్లు నిందితుడు అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం అతడిని ద్వితీయ అదనపు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇళ్లను విడిచి వెళ్లే సమయంలో నాణ్యమైన తాళాలు వేయడంతో పాటు పొరుగువారికి సమాచారం ఇవ్వడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ప్రజలకు సూచించారు.


# అభివృద్ధి ముసుగులో డిప్యూటీ సీఎం.. అవినీతికి



**● జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్**

**టి మీడియా , జూలై 21, మధిర :**
మధిరలో అభివృద్ధి పేరుతో డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క భారీ అవినీతికి పాల్పడుతున్నారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్చార్జి లింగాల కమల్ రాజ్ ఆరోపించారు మంగళవారం వైరా నదిలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రోక్లైన్ తో లారీలతో చేస్తున్న అక్రమ ఇసుక రవాణాన్ని బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన అడ్డుకున్నారు. అనంతరం ప్రోక్లైన్ ఎదురుగా వైరా నదిలో కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ మధిరలో ఉన్న వైరా నదికి కడుతున్న రిటైనింగ్ వాల్ కి మట్టి వైరా నదిలో పెద్దపెద్ద గోతులు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా తీసుకొని వస్తున్నారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా వైరా నదిలో రైల్వే బ్రిడ్జికి సమీపంలో ప్రోక్లైన్ తో లారీలకు ఇసుక నింపి అక్రమ రవాణా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నదిలో 20 అడుగుల లోతు గుంతల తీయటం, వైరా నదిలో ఇసుక రవాణా చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదవాడు ఒక ఇసుక ట్రాక్టర్ తీసుకుని వెళ్తే కేసులు నమోదు చేసే అధికారులు వందల సంఖ్యలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వైరా నదిపై చెక్ డాం నిర్మించాం దీనిని కూడా ధ్వంసం చేయాలని డిప్యూటీ సీఎం ఆలోచన చేస్తున్నారని ఆయన అన్నారు. చెక్ డాం నిర్మాణం వల్ల మధిర లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. చెక్ డ్యామును పగలగొడితే సహించేది లేదన్నారు. మధిర లో జరుగుతున్న అవినీతినిపై బిఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మధిరలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వైరా నదిలో ప్రోక్లైన్తో అక్రమంగా ఇసుక తీసుకుని వస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ సీఎం నల్ల కళ్ళజోడు తీస్తే మధిరలో జరిగే అవినీతి కనపడుతుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు కౌన్సిలర్ వై వి అప్పారావు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కనుమూరి వెంకటేశ్వరరావు అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, పరిశ శ్రీనివాసరావు, ఆళ్ల నాగబాబు, వేల్పుల శివ తదితరులు పాల్గొన్నారు

# రేపు సి జి ఆర్ ఎఫ్ సమావేశం



**టీ మీడియా ,జులై 21 ,కూసుమంచి:**
విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం సి జి ఆర్ ఎఫ్ ( విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ) సమావేశం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం విద్యుత్తు ఉపకేంద్రం లో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరగనుంది. ఈ సమావేశంలో నేలకొండపల్లి కూసుమంచి తిరుమల పాలెం మండలాల పరిధిలోని బచ్చోడు కూసుమంచి పాలేరు రాజేశ్వరపురం, నేలకొండపల్లి సెక్షన్ల వినియోగదారులు, ప్రధానంగా రైతులు పాల్గొని విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించిన సమస్యలు , సామూహిక విద్యుత్తు సంబంధిత సమస్యలను ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని సి జి ఆర్ ఎఫ్ వరంగల్ చైర్ పర్సన్ జి నాగప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు అన్ని వర్గాల ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. తమ విద్యుత్ సమస్యలని పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగప్రసాద్ విద్యుత్ వినియోగదారులకు సూచించారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి

**టీ మీడియా, జులై 21 పెబ్బేరు :**
మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు నారమ్మ గారి తిక్క రెడ్డి మరణవార్త తెలుసుకున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి చేరుకొని తిక్క రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు అనంతరం తిక్క రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తిక్క రెడ్డి రైతుల సంక్షేమానికి గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన నాయకుడని కొనియాడారు ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలకు రైతు సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు తిక్క రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు కార్యక్రమంలో అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మండల అధ్యక్షులు వనం రాములు పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి



గ్రామ సర్పంచ్ హేమలత బి అర్ ఎస్ ముఖ్య నాయకులు వెంకటేష్ రాజశేఖర్ సాయినాథ్ మధు వేణు రెడ్డి వెంకటస్వామి బుచ్చన్న వేణు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమ వసూళ్లపై చైర్మెన్, కమిషనర్‌కు సిపిఎం లేఖ

**టీ మీడియా, జులై 21 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో భారత కమ్యునిస్టు పార్టీ మార్క్సిస్టు (సి పి ఎం) ఆధ్వర్యంలో పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పెబ్బేరు మండల కన్వీనర్ మండ్ల రాజు సిపిఎం మాజీ ఎంపీటీసీ జి బాలయ్య మాట్లాడుతూ పెబ్బేరు సంత 2025 జనవరి నుండి 2026 నేటి వరకు మున్సిపల్ నుంచి వరకు టెండర్ వేయడం లేదు కానీ కొంతమంది సంత కాంట్రాక్టర్లు పురపాలక సంఘం పేరుతో రసీదులు ముద్రించి మున్సిపాలిటీకి సంబంధం లేకుండానే అక్రమంగా రసీదులు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారు ప్రతివారం 12 లక్షల నుంచి 14 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఇప్పటికీ సంత అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మున్సిపల్ కు రావలసినది ఐదు కోట్ల 50 లక్షల రూపాయలు వసూలు చేసుకుని అటు మున్సిపాలిటీకి ఇటు ప్రభుత్వానికి కట్టకుండా అక్రమంగా వసూలు చేసుకుని కాంట్రాక్టర్లు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు ఇప్పటివరకు వసూలు చేసిన డబ్బులను వారిచే రికవరీ చేయాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీగా



డిమాండ్ చేస్తున్నాం సంతలో అక్రమంగా వసూలు చేస్తున్న కొందరిపై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా వారిపై కేసులు నమోదైనట్టు కమిషనర్ చెప్పారు అయినా వారిలో మార్పు రాకుండా ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సి పి ఎం పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఆటో జేఏసి కన్వీనర్ గా ఎనగందుల నాంపల్లి

**టీ మీడియా, జులై 21, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి:**
పెద్దపల్లి జిల్లా ఆటో జేఏసి అడ్ హాక్ కమిటీ జిల్లా కన్వీనర్ గా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ ఎనగందుల నాంపల్లి నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు లు ప్రకటించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా ఆటో యూనియన్ సమావేశంలో నాంపల్లి ని జిల్లా కన్వీనర్ గా నియమించారు. ఈ సందర్భంగా నాంపల్లి మాట్లాడుతూ ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని. జిల్లా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్తానని అని అన్నారు. తన నియామకానికి సహకరించిన, రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జనగామ కుమార్, ఐబి చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగూడాల సాయిలు లకు నాంపల్లి కృతజ్ఞతలు తెలిపారు.




# సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి లక్ష్మయ్య కన్నుమూత

**● సమరశీల కమ్యూనిస్టును కోల్పోయామని సీపీఎం నేతల నివాళి**

**టీ మీడియా,జూలై 21,సింగరేణి(కారేపల్లి):**
సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు,కారేపల్లి మండలం గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన ఎర్రబెల్లి లక్ష్మయ్య (60) మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. లక్ష్మయ్య మృతదేహంపై సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ,సీనియర్ నాయకులు తుమ్మోజు రాంమూర్తి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రబెల్లి లక్ష్మయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన సమరశీల కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. మాదారం, గుంపెళ్లగూడెం ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు,తాగునీటి సమస్యల పరిష్కారం,కుల వివక్షకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. గుంపెళ్లగూడెం గ్రామాభివృద్ధిలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నైతిక విలువలకు కట్టుబడి,జీవితాంతం ఎర్రజెండా సిద్ధాంతాల కోసం పనిచేసిన ఆదర్శ కమ్యూనిస్టుగా లక్ష్మయ్య నిలిచిపోయారని, ఆయన ఆచరించిన సిద్ధాంతాలు,పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన



నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కే.నరేంద్ర,మండల కమిటీ సభ్యులు గుర్రం వెంకన్న,నాయకులు పాపినేని నాగేశ్వరరావు,గుంపెళ్లగూడెం శాఖ కార్యదర్శి ఎర్రబెల్లి సతీష్,రాము,పొట్లకాయల రమేష్,ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు,భాగం వెంకటప్పారావు, వేములపల్లి రమణ,కళాకారుడు ఎర్రబెల్లి నాగేంద్రబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# 24 న దసరా జాతర లైసెన్స్ హక్కుల బహిరంగ వేలం

**టీ మీడియా,జులై21,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2026 దసరా జాతరకు సంబంధించిన వివిధ లైసెన్స్ హక్కుల బహిరంగ వేలం ఈ నెల 24వ తేదీ (శుక్రవారం)ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో పారదర్శకంగా వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు,వ్యాపారులు నిర్ణీత సమయానికి హాజరై వేలంలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పర్స పట్టాభిరామారావు,ఆలయ కార్యనిర్వాహణాధికారి కటుకూరి వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



# ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యతే



**● మామిడి తాండ్ర ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక శిబిరం**

**టీ మీడియా,జూలై 21 అశ్వరావుపేట :**
అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మామిడి తాండ్ర ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని నిర్వహించారు. బూత్ నంబర్లు 164, 165, 166, 167, 168 పరిధిలోని ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఇప్పటివరకు ఓటరు నమోదును పూర్తి చేయని అర్హులకు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు హాజరై, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ డి. కిషోర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్.డి. హసేన్, ఎన్నికల బూత్ స్థాయి అధికారుల ఇన్‌చార్జి జయరాం, ఎన్నికల ఉన్నత విభాగ క్లర్క్ లక్ష్మణరావు, ఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మా రాంబాబు, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకుడు కొత్తపల్లి రాము, బూత్ స్థాయి ప్రతినిధి, 10వ వార్డు కౌన్సిలర్ మిండా హరిబాబు, బూత్ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రతి అర్హుడి హక్కుతో పాటు బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని, ఇంకా నమోదు చేసుకోని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



**● విద్యార్థులపై లాఠీ-ఛార్జీ ఖండనీయం**
**● సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ**

**టీ మీడియా,జూలై 21,సింగరేణి(కారేపల్లి):**
నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ వైరా ఇన్‌చార్జి భుక్య శివ నాయక్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగ యువత,విద్యార్థులపై లాఠీఛార్జీ,టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని,ఎన్‌టీఏను రద్దు చేసి పారదర్శక పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మంగన్న,రామ్‌చందర్,పాపారావు,శ్రీను,లాలు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లేట్‌లెట్లు పడిపోయాయి

**● ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ**

**టి మీడియా , జూలై 21, అమరావతి బ్యూరో :**
చిన్నపాటి జ్వరమొచ్చినా చాలు కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు కాసుల వేటకు తెరతీస్తున్నాయి. వాతావరణ మార్పులతో సహజంగా వచ్చే దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులను ఆసరాగా చేసుకుని, రోగుల భయాందోళనలను ప్రైవేటు వైద్యులు సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల పేరిట సామాన్యుడి ముక్కుపిండి వేల రూపాయలు వసూలు చేస్తుండటంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా అల్లాడిపోతున్నారు.

సాధారణ జ్వరంతో ప్రైవేటు గడప తొక్కిన రోగికి 'డెంగీ' అనుమానం ఉందంటూ ల్యాబ్ పరీక్షల మోత మోగిస్తున్నారు. 'ప్లేట్‌లెట్లు పడిపోయాయి ప్రాణాలకే ప్రమాదం' అంటూ భయాన్ని సృష్టించి వెంటనే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటున్నారు. ఒక్కో రోగి నుంచి ల్యాబ్, ఆసుపత్రి బిల్లు, మందులు కలిపి కనిష్ఠంగా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

## అందుబాటులో ఉచిత వైద్య సేవలు

ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీపై పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) రవిబాబు స్పందించారు. సాధారణ జ్వరాలకు ప్రజలు ఆందోళన చెంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు, నాణ్యమైన మందులు, ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్లేట్‌లెట్ల కౌంట్ పరిశీలనకు ప్రత్యేక ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని, ప్రజలు ప్రైవేటు మాయలో పడకుండా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## నాలుగు రోజులకే రూ.25 వేలు వాత

"తీవ్రమైన జలుబు, జ్వరంతో తణుకులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాను. వైద్యులు పరీక్షించి కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్ష చేయించారు. దానికి సుమారు రూ.3 వేలు ఖర్చయింది. అంతటితో ఆగకుండా నన్ను నాలుగు రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉంచి, చికిత్స పేరిట ఏకంగా రూ.25 వేల బిల్లు వేశారు. ఇక కట్టలేక జిల్లా ఆసుపత్రిలో చేరా" తణుకు పట్టణానికి చెందిన వెంకటరమణ తెలిపారు.

## ఏమాత్రం మార్పు రాలేదు

గతంలో డెంగీ లేకుండానే వైద్యం చేసి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఓ ఆసుపత్రి యాజమాన్యం అక్రమ వసూళ్లకు పాల్పడటంపై జిల్లా కలెక్టర్ నాగరాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులను మోసం చేయకుండా ఉండేందుకు ఓపీ, ల్యాబ్ పరీక్షలు, ఇతర సేవల రుసుములను స్పష్టంగా కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలని ఆమె ప్రైవేట్ ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేశారు.
అయినప్పటికీ కొన్ని ప్రైవేటు యాజమాన్యాల్లో ఏమాత్రం మార్పు రాలేదు. కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కుతూ అనేక ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు నేటికీ ఫీజుల వివరాలను బోర్డులపై ప్రదర్శించడం లేదు. లోపల ఒక రేటు, బయట ఒక రేటు వసూలు చేస్తూ సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ల్యాబ్‌లు, ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పెరిగిన రసాయనాల వాడకం



**● తగ్గిన మిర్చి ఎగుమతులు**

**టి మీడియా , జూలై 21, అమరావతి బ్యూరో :**
దేశం నుంచి సుగంధ ద్రవ్య పంటల ఎగుమతుల్లో మిరప వాటా 26.55%. మరోవైపు గతేడాది ఎర్రబంగారం ఎగుమతులు తగ్గాయి. 2024 - 25 సంవత్సరంలో రూ.11,405 కోట్ల విలువైన 7.15లక్షల టన్నులు ఎగుమతి చేయగా, 2025-26లో రూ.10,396 కోట్ల విలువైన 6,83,661 టన్నులే ఎగుమతి అయింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం, షిప్పింగ్ ఛార్జీల పెరుగుదల, తగ్గిన ఉత్పత్తి తదితర పరిణామాలతోపాటు వివిధ దేశాలు అమలు చేస్తున్న కఠిన ఆహార భద్రతా నిబంధనలూ ఒక కారణం. కొన్నేళ్లుగా మిరపలో తెగుళ్ల తీవ్రత అధికం కావడంతో రసాయనాల వాడకం పెరుగుతోంది. వాటిలో నిషేధిత మందుల అవశేషాలు పరిమితికి మించి ఉన్నాయి. ఇటీవలే చైనా మూడు కంటెయినర్ల మిరపను తిరస్కరించింది. ఇదే సమయంలో ఎగుమతి రకాలకు లభించే ధర కూడా తగ్గుతోంది.

## తెలుగు రాష్ట్రాలదే ఆధిపత్యం

మిరప సాగులో తెలుగు రాష్ట్రాలదే ఆధిపత్యం కొనసాగుతోంది. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం ఎండు మిరపలో సగటున ఆంధ్రప్రదేశ్‌లో 50%, తెలంగాణలో 23% పండిస్తారు. తర్వాత స్థానంలో మధ్యప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, గుజరాత్ తదితర రాష్ట్రాలుంటాయి. సుగంధ ద్రవ్యాల బోర్డు ఇటీవల విడుదల చేసిన 2025-26 గణాంకాలు పరిశీలిస్తే ఏపీ వాటా 47.36%, తెలంగాణ 14.48% శాతానికి పరిమితమైంది. కొన్నేళ్లుగా జెమిని వైరస్, నల్లతామర ప్రభావం పెరగడమే సాగు, ఉత్పత్తి తగ్గడానికి కారణంగా తెలుస్తోంది.

## తొలిస్థానంలో చైనా

భారత్ నుంచి మిరప దిగుమతుల్లో చైనా తొలిస్థానంలో ఉంటోంది. 2024-25లో చైనాకు రూ.3,858 కోట్ల విలువైన 2,36,831 టన్నుల మిరప ఎగుమతి కాగా 2025-26లో రూ.3,171 కోట్ల విలువైన 2,10,998 టన్నులకే పరిమితమైంది. అమెరికా, బంగ్లాదేశ్‌కి కూడా ఎగుమతుల పరిమాణం, విలువ పరంగా తగ్గాయి. యూఏఈకి ఎగుమతులు 1,000 టన్నులు పెరిగినా విలువ పరంగా రూ.100 కోట్లు తగ్గింది.
ఎగుమతి మిరప సగటు ధర క్వింటాల్‌కు 2024-25లో రూ.15,939 లభించగా 2023-24లో అత్యధికంగా రూ.20,783 దక్కింది. 2025-26 సంవత్సరంలో సగటు ఎగుమతి ధర క్వింటాల్‌కు రూ.15,205 మాత్రమే ఉంది.

## తెగుళ్లు తట్టుకునే రకాల్ని అందుబాటులోకి తెస్తే

2025-26 సంవత్సరంలో క్వింటాల్‌కు సగటు ధర పరిశీలిస్తే అమెరికా రూ.25,769, థాయ్‌లాండ్ రూ.18,455, శ్రీలంక రూ.15,909, చైనా రూ.15,030, యూఏఈ రూ.9,628, బంగ్లాదేశ్ రూ.9,311 చొప్పున ఇచ్చాయి. రసాయనాల వాడకం తగ్గించి రైతుల్లో అవగాహన కల్పిస్తేనే మిరప పంటను రక్షించుకోవచ్చు. జెమిని వైరస్ ఎప్పటి నుంచో మిరప పంటను దెబ్బతీస్తోంది. 2021-22 నుంచి నల్లతామర తీవ్ర నష్టాలకు కారణమవుతోంది. వీటి నివారణకే రైతులు అధికశాతం పెట్టుబడి పెడుతున్నారు. తెగుళ్లు తట్టుకునే రకాల్ని అందుబాటులోకి తెస్తే మిరపలో రసాయనాల వాడకం, తద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. పంట నాణ్యత కూడా పెరుగుతుంది. మిరప సాగులో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు

# రాష్ట్రంలో 24.59 లక్షల ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ఛాన్స్

**● కేవైసీ చేయకపోవడమే కారణం**


**టి మీడియా , జూలై 21, హైదరాబాద్ బ్యూరో :**
బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలను అరికట్టడం, నకిలీ ఖాతాలను గుర్తించడం, మనీలాండరింగ్ వంటి అక్రమ కార్యకలాపాలను నివారించడం కోసం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 'నో యువర్ కస్టమర్' (కేవైసీ) విధానాన్ని తప్పనిసరి చేసింది. ప్రతి ఖాతాదారుడి వ్యక్తిగత వివరాలు, చిరునామా, గుర్తింపు పత్రాలు ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రీ-కేవైసీ పూర్తి చేయని ఖాతాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆర్బీఐ సూచనలు జారీ చేసింది.

## రీ-కేవైసీ చేయకపోతే ఏమవుతుందంటే?

బ్యాంకు నుంచి కేవైసీ నవీకరణకు సంబంధించిన సమాచారం వచ్చినప్పటికీ ఖాతాదారులు స్పందించకపోతే వారి ఖాతాలపై ఆంక్షలు విధించే అవకాశం ఉంటుంది. మొదట కొన్ని లావాదేవీలను పరిమితం చేసి, అవసరమైతే పూర్తిగా ఖాతాను ఫ్రీజ్ చేసే చర్యలు తీసుకోవచ్చు. ఫ్రీజ్ అయిన ఖాతా ద్వారా నగదు ఉపసంహరణలు, డబ్బు బదిలీలు, ఇతర బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. అందుకే బ్యాంకు నుంచి వచ్చే కేవైసీ సందేశాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అవసరమైన పత్రాలు సమర్పించడం మంచిది.

## ఖాతాలను మూడు రిస్క్ విభాగాలుగా విభజించిన ఆర్బీఐ

ఖాతాలో జరిగే లావాదేవీల స్వభావాన్ని బట్టి బ్యాంకులు




ఖాతాలను మూడు రకాలుగా వర్గీకరించాలని ఆర్బీఐ సూచించింది. ఒక్కోసారి రూ.50 వేలకుపైగా తరచుగా లావాదేవీలు జరిగే ఖాతాలను 'హై రిస్క్'గా గుర్తిస్తారు. వీరి కేవైసీ వివరాలను ప్రతి రెండేళ్లకోసారి తప్పనిసరిగా నవీకరించాలి. లావాదేవీలు మోస్తరు స్థాయిలో ఉండే ఖాతాలను 'మీడియం రిస్క్'గా పరిగణించి ఎనిమిదేళ్లకోసారి కేవైసీ చేయాలి. చాలా అరుదుగా లావాదేవీలు జరిగే ఖాతాలను 'లో రిస్క్'గా గుర్తించి ప్రతి పదేళ్లకోసారి రీ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ఖాతాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని ఆర్బీఐ భావిస్తోంది.

## తెలంగాణలో భారీ సంఖ్యలో పెండింగ్ కేవైసీ ఖాతాలు

తెలంగాణలో 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మొత్తం 24,59,248 బ్యాంకు ఖాతాలు రీ-కేవైసీ పూర్తి చేయలేదు. వీటిలో 2,88,122 ఖాతాల్లో ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని అధికారులు గుర్తించారు. ఒక ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకులోనే దాదాపు 9.99 లక్షల ఖాతాలు, మరో పెద్ద బ్యాంకులో 4.13 లక్షల ఖాతాలు రీ-కేవైసీ కోసం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ గణాంకాలు ఖాతాదారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. కేవైసీ తాజా సమాచారం అడిగినా ఇవ్వని వారి ఖాతాల ఫ్రీజింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రిజర్వు బ్యాంకు పేర్కొంది. ఎప్పటికప్పుడు రీ-కేవైసీ, అవసరమైతే ఖాతాల ఫ్రీజింగ్ ప్రక్రియను సమీక్షిస్తున్నట్లు తెలిపింది.

## ఖాతాదారులు చేయాల్సిందేమిటంటే?

ఖాతాదారులు తమ ఆధార్, పాన్, చిరునామా రుజువు, ఫొటో వంటి అవసరమైన పత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించాలి. బ్యాంకు నుంచి కేవైసీకి సంబంధించిన ఎస్ఎంఎస్, ఇ-మెయిల్ లేదా ఫోన్ కాల్ వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా సమీప శాఖను సంప్రదించడం మంచిది. ప్రస్తుతం అనేక బ్యాంకులు మొబైల్ యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వీడియో కేవైసీ వంటి సౌకర్యాల ద్వారా కూడా రీ-కేవైసీని పూర్తి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.
డిజిటల్ బ్యాంకింగ్ విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేవైసీ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ మాత్రమే కాదు, ఖాతాదారుల భద్రతకు కూడా కీలకమైన అంశం. సరైన సమయంలో రీ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ఖాతా ఫ్రీజ్ వంటి ఇబ్బందులను నివారించవచ్చు. బ్యాంకు నుంచి వచ్చే సూచనలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించడం ద్వారా లావాదేవీలు అంతరాయం లేకుండా కొనసాగించడంతో పాటు ఆర్థిక భద్రతను కూడా కాపాడుకోవచ్చు.

# మళ్లీ 'ఉపాధి' పనులు



**● వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం!**

**టి మీడియా , జూలై 21, హైదరాబాద్ బ్యూరో :**
ఉపాధి హామీ పథకం జీ రాంజీలో భాగంగా వర్షాకాలంలో రెండు నెలలు పాటు పనులకు విరామం ఇచ్చారు. ఎందుకంటే వ్యవసాయ సీజన్‌లో కూలీలు అందుబాటులో ఉండేందుకు దీనిని నిలిపి వేయాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది. అయితే ఈసారి ఎల్?నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. రెండు నెలల విరామం లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనుంది.

## అక్టోబర్ వరకు వర్షాభావం

నిజానికి రాష్ట్రంలో వర్షాకాలం సీజన్? ఎప్పటిలాగే ఉంటే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జీరాంజీ పథకాన్ని నిలిపి వేయాల్సి ఉండేది. కానీ ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సాగు విస్తీర్ణంలో 45 శాతమే రైతులు పంటలు వేయగలిగారు. అయితే వచ్చే అక్టోబర్ వరకు ఎల్?నినో పరిస్థితుల వల్ల వర్షాలు తగ్గుముఖం పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## యాసంగి మీద ప్రభావం పడే అవకాశం

వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆ ప్రభావం యాసంగి మీద ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీరాంజీకి రెండు నెలల విరామం అమలు చేయటం కష్టమని అధికారులు గుర్తించారు. దీంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీ రాంజీలో 2 నెలల విరామం సాధ్యం కాదని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని భావిస్తోంది.

## రాష్ట్రవ్యాప్తంగా జలసిరి కార్యక్రమం

ఇదిలా ఉండగా ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం సిద్ధం అవుతోంది. దీంట్లో భాగంగా జల సంరక్షణ పనులు పెద్దఎత్తున చేపట్టాలని అనుకుంటుంది. దీంతో జీరాంజీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జలసిరి కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ జలసిరి నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు.

## నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు

ఎల్‌నినో కారణంగా సంభవిస్తున్న పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. జీరాంజీ పథకం కింద నీటిసంరక్షణ, భూగర్భజలాల పెంపు, కరవు నివారణ, గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించనున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంట్లో భాగంగా మొత్తం 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 5,000 బోర్‌వెల్? రీఛార్జి నిర్మాణాలు, 5,000 ఊట కుంటల నిర్మాణాలు జరపనున్నారు. 25,000 సేద్యపు కుంటలను ఇప్పటికే మహిళా రైతుల కోసం మంజూరు చేశారు. దరఖాస్తులు వస్తే వాటిని కూడా మంజూరు చేయనున్నారు.

# చిక్కదనానికి యూరియా, యాసిడ్‌ల వాడకం?

**● లీటర్ స్వచ్ఛమైన పాలతో 50 లీటర్ల తయారీ**

**టి మీడియా , జూలై 21, మెదక్ :**
ప్రజల అవసరాలను అవకాశంగా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. పాలను కల్తీ చేసి ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్నారు. పాల ఉత్పత్తి తగ్గడం, ధరలు పెరగడం వల్ల అక్రమార్కులు ఈ దారి ఎంచుకున్నారు. పాలను చిక్కగా చేస్తూ వినియోగదారులను ఏమార్చుతున్నారు. అడ్డదారిలో వెళుతూ సొమ్ము చేసుకుంటున్నారు. పాల లీటరు ధర అధికం అవడంతో విడిగా అమ్ముకునే పలువురు ఇలా అడ్డదారులు తొక్కుతుండటం గమనార్హం.
పాలను ముట్టుకుంటే తడిగా అనిపిస్తుంది కానీ తాకితే చేతికి బొబ్బలు వస్తున్నాయి. అవి రసాయనాలతో తయారు చేసిన కల్తీ పాలు. తాజాగా మెదక్? జిల్లాలోని నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో ఓ తయారీ కేంద్రంపై దాడి చేయగా కల్తీ పాలు దొరికాయి. ఒక లీటరు పాలలో రసాయనాలు కలిపి 50 లీటర్ల వరకు పాలు తయారు చేస్తుండటం గమనార్హం. గోవిందరాజ్‌పల్లిలో అక్రమార్కులు పాలను కల్తీ చేసి వ్యాపారం చేస్తున్నారు. సంవత్సరం తర్వాత పసిగట్టిన పోలీసులు దాడి చేసి భారీ ఎత్తున యంత్ర సామగ్రి, ముడి సరుకు స్వాధీనం చేసుకున్నారు. కొందరిని అరెస్టు చేసి జైలుకు పంపించారు. నెయ్యి సైతం కల్తీ చేసి జంటనగరాలకు తరలించి విక్రయించడాన్ని గుర్తించారు. పాలల్లో ప్రాణాంతక రసాయనాలు



మెదక్ జిల్లాలోని నర్సాపూర్, కౌడిపల్లి వంటి ప్రాంతాలు జంట నగరాలకు దగ్గరగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో పాల డిమాండ్ పెరగడంతో కొందరు వ్యక్తులు నగర శివార్లలో పాల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వారు ఆటో, రిక్షాలు, ఇతర వాహనాల ద్వారా పాలను రవాణా చేసి విక్రయిస్తున్నారు. పాడి రైతుల నుంచి పాలను సేకరించి, ప్యాక్ చేసి లేదా విడిగా అమ్ముతున్నారు. ఈ వ్యాపార విధానం చట్టబద్ధమైనదే అయినప్పటికీ, కొందరు అక్రమార్కులు దురాశతో కల్తీకి పాల్పడుతున్నారు. వారు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా పాలను కల్తీ చేస్తున్నారు.
గతంలో కేవలం ఎక్కువ నీటిని కలిపే పద్ధతి ఉండేది. కానీ ఇప్పుడు కొందరు నేరస్థులు అంతకు మించి ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే ప్రమాదకర రసాయనాలను కలుపుతున్నారు. పాలు చిక్కగా ఉండేలా చేయడానికి వారు పిండి, యూరియా, పొద్దు తిరుగుడు నూనెను కలుపుతున్నారు. పాలు విరిగిపోకుండా ఉండేందుకు యాసిడ్‌ను కూడా కలుపుతున్నట్లు ఇటీవలి సంఘటనల్లో వెల్లడైంది.

## సబ్‌ఇన్‌స్పెక్టర్ చేతికి బొబ్బలు

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలోని ఒక కేంద్రంలో లభించిన పాలను తాకినప్పుడు ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ చేతికి బొబ్బలు రావడం, ఆ పాలను చిక్కగా చేయడానికి ఎంత ప్రమాదకరమైన రసాయనాలను కలిపారో స్పష్టం చేస్తోంది. అగ్గిపుల్ల లేదా చెంచా ఉపయోగించి ఆ రసాయనాన్ని పాలలో కలుపుతున్నట్లు గుర్తించారు. స్థానిక పాడి రైతుల నుంచి స్వచ్ఛమైన పాలను లీటరుకు రూ.60 చొప్పున సేకరించి, కల్తీ పాలను లీటరుకు రూ.100 వరకు విక్రయిస్తున్నారు. 50 లీటర్ల స్వచ్ఛమైన పాలతో 300 లీటర్ల వరకు కల్తీ పాలను తయారు చేసి, వాటిని ప్యాక్ చేసి హైదరాబాద్‌లో విక్రయించే వారని సమాచారం. ఆ ప్యాకెట్లపై ఎటువంటి వివరాలు ఉండేవి కావు. ఇటీవల కల్తీ పాల వ్యాపారంలో పాల్గొన్నందుకు నర్సాపూర్‌కు చెందిన ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.